# జీవితచిత్రాలు

శాంతారాం

దసరా సెలవులకి తాతగారి ఊరొచ్చిన అనంత్‌కి చెరువుగట్టున కొత్తగా లేచిన గుడిసెలు ఆశ్చర్యం కలిగించాయి. ఆ ఊరు ఎప్పుడొచ్చినా చెట్టు పుట్టల చుట్టూ తిరిగేవాడికి గుడిసెలు పెద్ద వినోద కేంద్రమయ్యాయి.

కట్టుగొయ్యలకి కట్టేసిన గాడిదలు, గోచీలతో చెరువులో దూకి ఈత కొట్టే నిల్వాకూలీల పిల్లలు, వాళ్ళ యాస అనంత్‌కి భలే తమాషా అనిపిస్తాయి. నిద్రలేవడం ఆలస్యం తాతకి కన్పించకుండా పిల్లిలా చెరువుకేసి తుర్రుమనే వాడు.

మూడ్రోజులు గడిచినా అనంత్‌కి ఆ పిల్లలతో పరిచయం కాలేదు. వాళ్ళు చెరువులో గబుక్కున దూకుతుంటే గట్టున నిలబడి చప్పట్లు చరిచేవాడు. వాళ్ళు రెట్టించిన ఉత్సాహంతో మళ్ళీ మళ్ళీ దూకి అనంత్‌కేసి చూసి పకపకా నవ్వే వాళ్ళు.

చెరువు నిశ్శబ్దంగా ఉంది. గట్టున గాడిదలు మేస్తున్నాయి. పిల్లకాయలంతా ఎక్కడికెళ్ళారో వాడి కర్థంకాలేదు. చెరువుకి పడమరగా దూరంగా వాళ్ళు అరడజనుమందీ కన్పించారు. అనంత్ అటుకేసి పరుగెత్తాడు. పిల్లకాలువ గట్టున వాళ్ళంతా నిశ్శబ్దంగా ఎందుకూర్చున్నారో అర్థంకాలేదు. వాళ్ళందర్లోకి తనంత ఎత్తుండే చట్టిముక్కు కుర్రాడంటే అనంత్‌కి ఎంతో ఇష్టం. వాడెప్పుడూ నవ్వుతూ ఉంటాడని కామోసు.

వెళ్ళి చట్టిముక్కు కుర్రాడి పక్కన కూర్చుని ఏదో అడగబోయాడు వాడు 'ష్' అన్నాడు. ఉన్నట్టుండి కాకినలుపు కుర్రాడు గాలం బైటికి లాగాడు. ఏమీ రాలేదు. చేప ఎరని కొద్దిగా కొరుక్కుపోయిందిగాని గాలానికి చిక్కలేదు. వాడు వానపాముని సగానికి తుంచి మళ్ళీ గాలంముల్లుకి గుచ్చాడు.

**నీళ్ళులేని చేపలు**

చట్టిముక్కు కుర్రాడు గాలం బైటికి లాగాడు. జానెడు పొడవున్న మట్ట గుడిసె గాలం ముల్లుకి చిక్కింది. అదే మొదటి చేప వాళ్ళు కేరింతలు కొట్టారు.

విలవిలా కొట్టుకుంటున్న ఆ నల్లటి చేపకేసి అనంత్ చూడలేకపోయాడు. కళ్ళు గట్టిగా మూసుకున్నాడు. చేపని వాళ్ళు బుట్టలో వేశారు. అది బుట్టలో కూడా టపాటపా కొట్టుకొంటోంది. అనంత్ బుట్టలోకి తొంగిచూశాడు. నల్లటి నోట్లోంచి ఎర్రని రక్తం.

చెరువులో హాయిగా ఈత కొట్టొచ్చు గదా, పాపం ఈ బుల్లి చేపల్ని ఎందుకు చంపడమని అనంత్ చట్టిముక్కోడ్ణి అడిగాడు. వాడు మళ్ళీ 'ష్' అని గబుక్కున గాలం లాగాడు. ఈసారి గురక చేప పడింది. దాని గొంతులో ఇరుక్కున్న గాలం ముల్లుని తీస్తుంటే అనంత్ గుండె మళ్ళీ కలుక్కుమంది.

"రోజంతా ఆడుకుంటే తిండి ఎట్టా తినాలి? అసలీ సేప ఎంత రుసిగా ఉంటదో తెలుసా?" చట్టిముక్కు కుర్రాడు గాలం మళ్ళీ విసుర్తూ అడిగాడు.


"ఆళ్ళు సేపలు తినరట్టుంది!" అన్నాడు నల్లోడు అనంత్‌కేసి ఎక సెక్కెంగా చూస్తూ. మళ్ళీ ఎవరి ధ్యాసలో వాళ్ళు పడిపోయారు. ఉన్నట్టుండి అనంత్ కెవ్వుమన్నాడు. నల్లోడు లాగిన ఖాళీ గాలం అనంత్ చెవిలో దిగి ఇటు పక్క కొచ్చేసింది. పిల్లకాయలంతా బిత్తరపోయారు.

అనంత్ చెవినుంచి రక్తం. చట్టిముక్కు కుర్రాడు వణుకుతూనే ఒడుపుగా ముల్లు లాగేశాడు. ముల్లు పీకేటప్పుడు అనంత్ మళ్ళీ గట్టిగా ఏడ్చాడు.

అనంత్‌కి మూడు రోజులు జ్వరం మంటలు మండింది. రోజూ డాక్టరొచ్చి పోతున్నాడు. మూడురోజులూ వాడికి ఒకటే కలలు. కాలువ గట్టున గాలాలకు చిక్కి విలవిల్లాడే చేపలు...అవి గట్టిగా ఏడుస్తున్నట్టు...తను వెళ్ళి వాటిని మళ్ళీ నీళ్ళలోకి వదిలేసినట్టు...అవి బతికినట్టు...తనని ఆ పిల్లలంతా కొట్టినట్టు...అబ్బ...ఆ గాలం ముల్లెంత భయంకరంగా ఉంది. తన చెవికి తాకితేనే అంత బాధ...మరి ఆ చేపలమల్లే ముల్లు గొంతులో దిగితే?

అనంత్ మంచం మీదున్నప్పుడు దసరా సెలవులు అయిపోయాయి. కొంచెం కోలుకున్నాక నాన్న వచ్చి వాణ్ణి తీసుకెళ్ళిపోయాడు. వెళ్ళేముందు వాడు తాతకి ఫిర్యాదు చేశాడు. చెరువుగట్టునున్న గుడిసెల్ని పీకించెయ్యమని చెప్పాడు.

* * * *




మళ్ళీ దసరా. అనంత్ ఉత్సాహంగా తాతగారి ఊరొచ్చాడు. బస్సులో వస్తున్నప్పుడు అన్నం తింటున్నప్పుడు ఒకటే ఆలోచన. చెరువు గట్టున పిల్లకాయలు ఇప్పుడేమి చేస్తుంటారా అని.

ఆ ఏడాది వానలు పడలేదు. చిన్నరైతులు కరువుదెబ్బకి విలవిల్లాడుతున్నారు. గోనె సంచులు తెచ్చుకున్న ఇద్దరు రైతులకి పాలేరు ధాన్యం కొలుస్తున్నాడు. తాత చూస్తూ కూర్చున్నాడు.

ఆ సమయంలో బైటికెళితే తాత చూస్తాడని బుద్ధిమంతుళ్ళా కూర్చున్నాడు. దూరంగా పొలాలు...ఈసారి ఆకుపచ్చదనమే లేదు.

అనంత్ మనసంతా చెరువుగట్టుమీదే ఉంది. ఆ చట్టిముక్కు కుర్రాడు ఏం చేస్తుంటాడో. తాత ఊళ్ళోవాళ్ళందరికీ చెప్పి ఆ గుడిసెలు పీకించేసి ఉంటాడా.:.

అనంత్ కాలుగాలిన పిల్లిలా వరండాలో అటూ ఇటూ తిరిగాడు. తాత వంటింట్లోకి వెళ్ళడం ఆలస్యం బైటికి పరుగు తీశాడు.

ఏడాది తర్వాత మళ్ళీ చెట్టుపుట్టల మధ్య పరుగు. ఆకాశంలో మబ్బుతునకలా హాయిగా పరుగు. చెరువు దగ్గరయింది. ఇదసలు ఆ చెరువేనా అని అనంత్‌కి అనుమానమేసింది. చుక్క నీరు లేదు. చుట్టూ ఎండిన పొలాలు.

ఎండిపోయిన చెరువు ఖాళీ అయిన అన్నం గిన్నెలా ఉంది. తను ఈత నేర్చుకొనేదెలా? అనంత్ నిరుత్సాహంగా చూశాడు.

తీరా చూస్తే గుడిసెలు లేవు. వాటిని పీకేసి గాడిదల కెక్కిస్తున్నారు. పెద్దవాళ్లు కుండా చట్టీ సర్దుకొంటుంటే పిల్లకాయలు గాడిదలమీద వేస్తున్నారు వాళ్లు అనంత్‌ని పట్టించుకోలేదు. చట్టిముక్కు కుర్రాడు మాత్రం పెదవులు కదిలీ కదలనట్టు నవ్వాడు. ఎప్పుడూ పెదాలు బారలా సాగదీసి నవ్వేవాడు ఇలా అయిపోయాదేమిటా అనుకున్నాడు అనంత్.

గబగబా వెళ్ళి "ఎక్కడికి?" అని అమాయకంగా అడిగాడు. వాళ్ళు పట్టించుకోలేదు.

'ఏడాదికో కరువైతే ఎట్టా బతికేది...ఎక్కడికి పోయేది?' అంటూ ఓ ముసలి కూలీ గొణుక్కుంటున్నాడు.

చట్టిముక్కు కుర్రోడు మాత్రం "కరువొచ్చిందంట. పనుల్లేవు. పట్నాని కెళ్తున్నాం" అని ముక్తసరిగా అనంత్ దగ్గరికొచ్చి చెప్పాడు.

గాడిదలు ముందు నడుస్తుంటే - పెద్దోళ్ళు, పిల్లాజెల్లా వెనకగా పోతున్నారు. నీటి మడుగులు వెతుక్కుంటున్న చేపల్లా-చట్టిముక్కు కుర్రాడు అప్పుడప్పుడు వెనక్కి తిరిగి అనంత్‌కేసి చూస్తున్నాడు. తుప్పుపట్టిన విల్లులా వాడి చేతిలో గాలం. అనంత్ ఆ దృశ్యాన్ని అలాగే చూస్తుండిపోయాడు. ఇంటి కొచ్చిన ఆప్తులు అకస్మాత్తుగా వెళ్ళిపోయేప్పుడు కలిగేబాధ అనంత్‌ది. అతనికి ఏడుపొచ్చింది. వాళ్ళవెంట కొంచెం దూరం పరుగుతీశాడు..

అంతకుముందు వాళ్ళు చేపలు పట్టిన పిల్లకాల్వ కూడా ఎండిపోయింది. నెర్రలు విచ్చింది. తనకి ఈత నేర్పేదెవరు? అసలు చెరువే ఎండిపోయింది.

వానలు కురిసి కాల్వలు పారి, చేపలు వస్తే అప్పుడు వీళ్ళంతా కేరింతలు కొడితే...ఎంత బావుణ్ణు అనుకున్నాడు ఆశగా అనంత్. "వాన...వాన..." అని గట్టిగా అరవబోయాడు.

వాళ్ళంతా అప్పటికే డొంక వెంటబడి చాలా దూరం వెళ్ళిపోయారు. కళ్ళల్లో ఉబికిన నీరు తుడుచుకుని మళ్ళీ ఆకాశంకేసి చూశాడు. మబ్బులు రసం పిండేసిన చెరకుపిప్పిలా కన్పించాయి. ఎండపొర వేడిగా తగిలింది. నీళ్ళు నిండిన కళ్ళతో చూస్తే మబ్బుల్లో నీళ్లు కన్పిస్తాయేమో అనుకొంటూ అనంత్ వెనుదిరిగి అడుగులో అడుగేస్తున్నాడు. **